# నెరవేరని ఆశయం




"ఈనాడు మనదేశంలో తలెత్తిన సమస్యలలో ముఖ్యమైనది నానాటికీ పెరిగిపోతున్న జనాభా : జనాభాకు సంబంధించి నంతవరకు చైనా తరువాత ప్రపంచంలో చెప్పుకోదగ్గది మన భారతదేశం. దాదాపు ముప్పది ఆరు కోట్ల జనాభాతో మనదేశం ప్రపంచజనాభాలో అరవ వంతును కలిగియుంటోంది. మన దేశంలో ఆహారోత్పత్తి పెరుగుదలకంటే జనాభా పెరుగుదల అత్యధికం. కనుకనే మన జీవితప్రమాణాలస్థాయి నానాటికీ దిగజారిపోతోంది. ఎప్పుడో, ఎక్కడో యేర్పడే క్షామాలు, తటస్థించే భూకంపాలు, యుద్ధాలు, వరదలు మున్నగు ప్రమాదాలు మినహాయిస్తే మనకు ఈ "పెరిగే జనసంఖ్య" అనేది తీవ్రంగా ఆలోచించాల్సిన ఒక ముఖ్య సమస్య. మనదేశంలో ప్రతి పది సంవత్సరాలలోను పెరిగే అధికజనసంఖ్య, ప్రపంచంలోని పెక్కుదేశాల జనాభాకంటే అధికం...."

క్లాసులోని విద్యార్థులంతా గట్టిగ నవ్వారు. ప్రొఫెసర్ రంగారావు ఒక్కమారు క్లాసంతా సీరియస్‌గాచూచి మరల తమ ఉపన్యాసం ప్రారంభించారు. "ఇది నవ్వును కలుగచేసే విషయం కావచ్చు. అంతమాత్రాన నవ్వాల్సిన అవసరమేమిటి ? దీనిని ప్రతి ఒక్కరి బాధ్యతలాగ భావించి, తీవ్రంగా చర్చించి, చక్కగా ఆలోచించి, పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఎందుకంటే, భారతదేశ జనాభాసమస్య అనేది మన ఆర్థిక జీవిత విధానంలోని ప్రతి చిన్నవిషయంపైన ప్రభావాన్ని కలుగచేయటమేగాక, దేశభవిష్యత్తులో ఎంతో ప్రాధాన్యతను కలిగియుంది. మన వ్యవసాయంలోని బలహీనత, ఆర్థికవిధానంలోని ఒడుదుడుకు లనేవి అధిక జనాభావత్తిడి వల్ల జనించే క్లిష్టసమస్యలు. చక్కగా ఆలోచించగలిగే ప్రతి భారతీయుని కలతపెట్టే భయంకర నిరుద్యోగ సమస్యకూడ అధిక జనాభావల్ల యేర్పడ్డ దుష్ఫలితమే. ఘోర హత్యానేరాలు పెరగటం, హింసాచర్యలు తలెత్తటం, నైతికస్థాయి దిగజారటం మున్నగు కృత్యాలు నిరుద్యోగసమస్యవల్ల ఉద్భవించినవే!"

ఈ మాటలు చెబుతూ ప్లాట్‌ఫారమ్‌మీద అటూ, ఇటూ తిరుగుతున్న రంగారావు ఒక చోట ఆగి, ఒక్కమారు విద్యార్థులవైపు చూచి మళ్లీ చెప్పటం సాగించారు. "వార్నర్ థామ్సన్" అనే యువతి ఇండియాలో నానాటికీ పెరిగిపోతున్న జనాభాను గూర్చి వ్యాఖ్యానం చేస్తూ "మరి మూడు నాలుగు దశాబ్దాల్లో భారతదేశ జనాభా దాదాపు ఎనభై కోట్లవరకు పెరిగి ప్రపంచశాంతికే భంగం కలుగచేయవచ్చుననీ, అప్పుడు మానవుని నిత్యజీవితావసరానికి కావలసిన వస్తువులనుకూడ తన శక్తినంతా ప్రయోగించి సాధించుకోవలసి వుంటుంది" అని అంది. మనదేశంలో అటువంటి పరిస్థితు లేర్పడటం మీ కందరికీ ఇష్టమేనా....? మనం ఆచరించేపనులు, ముందు

> రచయిత :
> నరిశేపల్లి లక్ష్మినారాయణ, బి. ఏ.

తరాలవారిపై గొప్ప ప్రభావాన్ని ప్రసరింపచేస్తాయనే విషయాన్ని మీరు అర్థంచేసుకున్నారా....?"

స్వేదబిందువులతో నిండియున్న ప్రొఫెసర్ రంగారావు ముఖం, నీటిబిందువులతో తళతళలాడే తామరాకులాగ నిగనిగలాడుతోంది. ప్యాంట్‌పాకెట్‌లోనుండి చేతిరుమాలు తీసి ముఖం తుడుచుకొని మరల జేబులో పెట్టుకున్నారు. "కుటుంబ నియంత్రణం" గూర్చి ప్రచారంచేసేవారిలో రంగారావు కూడ ఒకరవటంవల్ల వీరు ఇంతసేపూ ఈవిషయంమీద గంభీరోపన్యాసం యిచ్చారు. కానీ క్లాసులో కూర్చున్న విద్యార్థు లెవ్వరూ రంగారావు ఉపన్యాసాన్ని శ్రద్ధగా వినలేదు. వర్తమాన, భవిష్యత్తుల్లో ఇండియా జనాభాసమస్యకంటే, ఆ రోజు క్రొత్తగావేసిన పిక్చర్ కెళ్ళాలనే విషయంపై వారి ఆలోచనలు కేంద్రీకృతమయ్యాయి. అందువల్ల రంగారావు ఉపన్యాసాన్ని వారు అట్టే వినిపించుకోలేదు.

ప్రొఫెసర్ రంగారావు ఏమాత్రం నిరుత్సాహం చెందలేదు. వారు మరల ప్రారంభించారు. "మనం 'కుటుంబనియంత్రణ'ను ఆచరణలో పెట్టామంటే మన జీవితప్రమాణాలు పెరగటానికి అవకాశాలున్నాయి. 'కుటుంబనియంత్రణ' అంటే ఎన్నికద్వారా పిల్లలను పొందటంకానీ అదృష్టం, కోరికల వల్లకాదు. ఇందువల్ల జన్మనిరోధానికిగాను మనం కొన్ని పద్ధతులను అవలంబించవలసి వుంటుంది. పాశ్చాత్యదేశాలలో ఈ జన్మనిరోధ ఉద్యమం చర్చకి వ్యతిరేకంగా, తీవ్రంగా వ్యాప్తిచెందింది. అనాదినుండి మనలను అంటుతూవస్తున్న ఆచారాలను ప్రతిఘటించి క్రొత్త సాంఘికవ్యవస్థను ప్రతిష్టించటానికి కావలసిన, ఒక తరంవారిని, సరికొత్తపోకడల్లో, జాగ్రదావస్థలోవున్న ప్రభుత్వాలతో, ఆధునికపద్ధతులలో ఉధృత ప్రచారంవల్ల తీసుకువచ్చి సంసిద్ధపరచవచ్చు" అని అదే విధంగా రంగారావు తమ సుదీర్ఘ ఉపన్యాసాన్ని కొనసాగిస్తుండగా క్లాసులో రెండు మూడుచోట్ల ఉన్నట్టుండి అలజడి రేగింది. ద్వారంవద్ద ఎవరైనా వచ్చి నిల్చుంటే గాని, ఎవరైనా లోనికొస్తేగాని, బయటికెడితే గాని క్లాసులో అలాంటి అలజడులు, రణగొణ ధ్వనులు యేర్పడుతాయనే విషయం రంగారావుకి తెలియనిదికాదు. వెంటనే ద్వారం వైపు చూచాడు. ప్రవేశద్వారంవద్ద తన ఇంటి నౌకరు నిల్చున్నాడు. రంగారావుగారు చెప్పేదేదో ఆపి ప్లాట్‌ఫారందిగి ద్వారంవద్దకు నడిచాడు.

"అమ్మగారు మిమ్మల్ని అర్జంటుగా రమ్మన్నారు సార్!" అన్నాడు నౌకరు.

"కారణం!" రంగారావుగారి ప్రశ్న.

నౌకరు సమాధానమివ్వక ఎఱ్ఱబడ్డముఖంతో తలవంచుకుని నిల్చున్నాడు.

"అడిగిందానికి చెప్పవేం?" ప్రొఫెసర్‌గారు గద్దించారు.

"నాకు తెలియదుసార్!" అనే మాటలు సమాధానంగా నౌకరు నోటినుండి వెలువడ్డాయి.

"మరి ఈమాత్రందానికి నోరు విప్పకుండా తలవంచుకు నిల్చుంటావేం!" రంగారావు గారు అంత ఉత్సాహపూరితంగాలేదు. సాధారణంగా వారు క్లాసులో లెక్చర్‌యిచ్చేటప్పుడు ఇలాంటి ఆటంకాలేవైనా యేర్పడితే వారు సహించలేరు. అంతేకాక తాను ఇపుడు విద్యార్థులకు చెబుతున్నది ఎంత చక్కటివిషయం. అది తన అభిమాన ఆశయప్రబోధం 'కుటుంబ నియంత్రణం.'

"సరే! నీవు వెళ్ళు. మరో అరగంటకల్లా నేను ఇంటివద్ద వుంటాను సరేనా?" అన్నారు రంగారావు.

"అలాగేసార్!" అని నౌకరు అక్కడనుండి వెళ్లిపొయ్యాడు. ప్రొఫెసర్ రంగారావు తన లెక్చర్ ముగించి ప్లాట్‌ఫారం దిగివచ్చారు.

ఆరోజులో తతిమ్మా సమయమంతా వారికి లీషర్‌గా వుండటంవల్ల ఇంటిముఖంపట్టారు. ఇంటిలో అంత అర్జంటుగా తన అవసరమేమిటో వారికి ఊహాతీతమైపోయింది.

రంగారావు పిన్నవయసులోనే ప్రొఫెసర్ పదవిని పొందగలిగారు. రంగారావు ఆర్థికశాస్త్రవిద్యార్థి. ఆ సబ్జక్టు అంటే అతనికి తగని అభిమానం. అందులోనూ నిత్యజీవితాచరణలో ఎంతో ప్రాముఖ్యత కలిగినదని భావించటంవల్ల వారు దానినే యెన్నుకున్నారు. ఆలోచనా పూర్వకంగానో, అనాలోచితంగానో అనుదినం మనం మనదైనందిన జీవితంలో అర్థికశాస్త్రసూత్రాలను అనుసరిస్తున్నాం. కనుకనే వారు అర్థికశాస్త్రాన్ని ఆహ్వానించారు. బాగా స్టడీచేసి, దాన్ని 'మాస్టర్'చేసి రీసెర్చి చేసి, సమాజానికి, దేశానికి ఉపయోగకరంగా ఉండి సేవచేయగలిగే క్రొత్తవిషయాలను అందచేయా లనుకున్నాడు. కానీ అదృష్టవశాత్తో, దురదృష్టవశాత్తో జనాభాసమస్య వారినెదుర్కొంది. అతను దివ్యంగా ఆలోచించగలిగే భారతీయుడు గనుక ఆ విషయమంటే అతనికి ఎక్కడలేని శ్రద్ధ ఎంతో పుట్టుకొచ్చేది. ఎందుకంటే ఒకరకంగా అది ప్రతినిమిషమూ అతన్ని బాధించేది. దీనినిగూర్చి ఆలోచించి యేదైనా చెయ్యటానికి అతడు తన మేధస్సును వినియోగించాడు. ఒక క్రొత్త విధానాన్ని అందచేశాక రంగారావుకి పి. హెచ్. డి. లభించింది.

వారికి సొంతపూరులోనే వున్న కళాశాల అవకాశమిచ్చింది. కొద్ది సంవత్సరాలలోనే వారు ప్రొఫెసర్ అయ్యారు. ఆ సమయంలో వారు జనాభామీద రిసర్చి కొనసాగిస్తుండేవారు. ఆ కళాశాల ప్రిన్సిపాల్‌గారికి రంగారావుమీద ఎంత ప్రేమాభిమానాలుండేవో, రంగారావుకి ప్రిన్సిపాల్ మీద అంత గౌరవాభిమానాలుండేవి. ఒకమారు రంగారావునిగూర్చి ఆలోచిస్తున్న ప్రిన్సిపాల్ కి ఒకచిన్న 'ఐడియా' తట్టింది. ప్రిన్సిపాల్ దాన్ని ఆచరణలోపెట్టి అమితానందభరితులయ్యారు.

ప్రిన్సిపాల్‌కి ఆరుగురు గుమార్తెలుండేవారు. అప్పటికప్పుడే ఆయన తన ముగ్గురు కుమార్తెలను కాలేజీలోవున్న ముగ్గురు యువక లెక్చరర్లకిచ్చి వివాహంచేసాడు. రంగారావుని కూడ తన అల్లుడిగా చేసుకుంటే చాల బావుంటుందనుకున్నాడు. ఈ వివాహం జరిగితే కళాశాల తతంగమంతా తన కుటుంబ వ్యవహారంలాగ వుంటుందని భావించాడు.

కనుకనే తన తరువాతి కుమార్తెను రంగారావుకిచ్చి ఆ మూడు ముళ్ళూ పడ్డాయని పించాడు. మొట్టమొదట రంగారావుకి ఈ ఉద్దేశ్యం నచ్చలేదు. ఎందుకంటే జనసంఖ్య ఎక్కువవున్న కుటుంబంలో వివాహంచేసుకో కూడదనే సంకల్పం మొదటినుండీ వుండేది. జనాభా ఎంతసేపున్నా అధికజనాభాను తీసుకు వస్తుంది. అయినా ప్రిన్సిపాల్ అంటే సాధారణవ్యక్తి గాదు. ఘటనాఘటన సమర్థుడు. కనీసం 'పాపం' అని అనకుండా తన నాలుగో తప్పును 'మరెవరూ దొరకలేదన్నట్టు' రంగారావుమీద బలవంతంగా ప్రయోగించారు.

రంగారావుకి ఎన్నో ఆశయాలుండేవి. వాటిలో విజయం పొందివుంటే అర్థికశాస్త్ర రంగంలో తనకుతానే తన పేరును శాశ్వతం చేసుకొనేవారు. అంతేకాక తన దేశజనాభా సమస్యను ఎన్నడో ముట్టడించేవాడు. హిందూదేశంలో ఒకటీ ఒకటీ కలిస్తే అది ఎప్పటికీ రెండు కాదని, అది మూడైనా కావాలి లేదా పదకొండుఅయినా కావాలి అని అనుకున్నాడు రంగారావు. 'జనాభాసమస్య ఒక నవ్వులాట కాదు. ఎదుర్కొని పరిష్కరింప దుస్సాధ్యమైన ఒక భయంకరసమస్య' అని తలచారు వారు. ఈ క్లిష్టసమస్యను పరిష్కరించి బయటికి రావటానికి వారికి ఒక్కటే మార్గం అగుపించింది. అదే 'కుటుంబ నియంత్రణం' భారతదేశానికి అది అత్యవసరమని తాను భావించటమేగాక ఇతరులకు దాని అవశ్యకతను, ప్రాముఖ్యతను విప్పి, వివరించి, మరీ మరీ చెప్పాడు. 'కుటుంబ నియంత్రణం' అనేది ఒక కళ. వ్రాయటం అనే కళతో 'కుటుంబ నియంత్రణం' అనే కళను పోల్చవచ్చు' అని జూలియన్‌యక్సలీ అన్నారు. ఆయన ఈ విధంగా ప్రచారంసాగిస్తువచ్చారు. భారతప్రభుత్వం కుటుంబ నియంత్రణను ఆచరణలో పెట్టటానికి పూనుకుంది. కుటుంబ నియంత్రణను ప్రభుత్వపరంగా ఆచరణలో పెట్టడానికి ప్రపంచంలోకెల్లా ప్రయత్నించిన దేశాల్లో భారతదేశానిదే ప్రథమస్థానం. ఫరవాలేదు. ఎక్కడో డిల్లీ సెక్రటేరియట్‌లో బాగా ఆలోచించగలిగే వ్యక్తి వున్నాడు. ప్రభుత్వ భుజాన్ని తట్టారు రంగారావు. కానీ 'కుటుంబ నియంత్రణం'వల్ల తగిన ఫలితాలు లభించలేదనేదిమాత్రం నగ్నసత్యం.

రంగారావు మస్తిష్కంలో ఎన్నో ఆలోచనలు మెదులుతున్నాయి. దాన్నిప్రచారంకోసం ప్రభుత్వం చలనచిత్రాలు మున్నగువాటిని సాధనాలుగ ఉపయోగించవచ్చు. బ్రహ్మచారులపై తక్కువపన్ను విధించి ప్రభుత్వం బ్రహ్మచర్యాన్ని ప్రోత్సహించవచ్చు. ఉద్యోగాలకోసం వారు బ్రహ్మచారులనే 'ప్రిఫర్' చేయవచ్చు. జనాభా తక్కువగల ఇటలీ, జర్మనీ మున్నగు దేశాల పరిపాలకులు జనాభా అభివృద్ధికోసం ఉద్యోగాలను అధికంగా వివాహితులకే కల్పించటంలేదా....? యువకులు ఆ విధంగా పెళ్ళిళ్ళుచేసుకోటానికి పురమాయింపబడుతున్నారు. కుటుంబ నియంత్రణాచరణావశ్యకతనుగూర్చి రంగారావు అగుపించే తన ప్రతిమిత్రునితోను చెబుతున్నాడు. తన క్లాసులో ఎప్పుడైనా జనాభా సమస్యనుగూర్చి కదిపితే, చాల వ్యవధి తీసుకొని కుటుంబనియంత్రణవల్ల కలిగే లాభాలెల్లాంటివో, వాటిద్వారా దేశం వివిధంగా బాగుపడుతుందో మున్నగు విషయాలను పెక్కింటిని చక్కగా వివరించేవాడు. తన విద్యార్థులంతా వివాహంచేసుకున్నాక ప్రతి ఒక్కరూ కుటుంబనియంత్రణను అమలు జరపాలని కోరాడు కానీ, పరీక్షల్లోని సమాధానపత్రాలలో తన విద్యార్థులు వ్రాసిన విషయాలు అతనికి ఏవగింపును కలిగించాయి.

"పిల్లల అవశ్యకతే వివాహమనే సాంఘిక శుభకార్యానికి మూలము" అని వ్రాశాడొక విద్యార్థి.

"ఒక వ్యక్తి ఎంత అధికంగా సంతానోత్పత్తిని గావిస్తాడో అతడు అంతగా దేశానికి

సేవచేసినట్లౌతాడు" అని ఆలివర్ గోల్డ్‌స్మిత్ చెప్పాడు అని మరొక విద్యార్థి ప్రవచించాడు. మరో స్టూడెంట్ 'కాలిన్‌క్లర్క్' చెప్పింది కోట్ చేశాడు, 'ఎంత శక్తివంతుడైన ఏ రాజకీయ నాయకుడుగాని, ఎంత చదువుకున్న ఆర్థిక శాస్త్రవేత్తగాని, సంతానోత్పత్తి విషయంలో జోక్యంచేసుకోటానికి వారికున్న హక్కు బహు స్వల్పంకాదు! అది మరో పద్ధతిలో వుంది! తమ పిల్లలకు తినటానికి తగినంత లభ్యమయ్యేట్టు ప్రపంచాన్ని తీర్చిదిద్దమని ప్రధాన మంత్రులను, ఆర్థిక శాస్త్రనిపుణులను కోరటానికి తల్లిదండ్రులకు హక్కు వుంది!"

రంగారావు ఒక్క నిట్టూర్పు విడిచాడు; తగిన విశ్రాంతి లభించినందువల్ల కాదు; కానీ ఎడతెగని ఆలోచనలవల్ల పుట్టుకొచ్చిన విసుగువల్ల, చివరి విద్యార్థి వ్రాసిన విషయాన్ని రంగారావు ఖండించలేకపొయ్యాడు. ఎందుకంటే అది కాలిన్‌క్లర్క్ సిద్ధాంతీకరించిన విషయం గనుక, ప్రతిభావంతులైన పెక్కు ఆర్థికశాస్త్రవేత్తలు ప్రకటించిన విభిన్నాభిప్రాయాలను రంగారావు ఎంతో గౌరవించాడు కానీ, ఎవరైనా ఆర్థికశాస్త్రవేత్త తన పరిశీలనలను ఖండిస్తే అవి తనకు ఏమాత్రం యిష్టం వుండదు.

"భారతదేశంలోని అధిక జనాభా పెరుగుదల మన సంస్కృతిలో ఒక భాగం" అని మరొకరు వ్రాశారు.

"అబ్బా! ఈ విద్యార్థులు, తన ధోరణిలో ఎందుకు వ్రాయకూడదు. వారేది వ్రాస్తారో బాగా ఆలోచించకుండా వ్రాస్తారనే విషయం రంగారావు కెన్నడూ అంతుచిక్కలేదు. ఇది ఇంచుమించు మన పత్రికల్లో అగుపించేలాగ '.......లో రచయితలు వెలువరించే అభిప్రాయాలతో సంపాదకులేమాత్రం ఏకీభవించలేకపోవచ్చు: అవి సంపాదకుని అభిప్రాయాలు ఎంతమాత్రం కాజాలవు' అన్నట్లుంటుంది.

ఆవిధంగా ఆలోచిస్తు నడుస్తున్న రంగారావుకి తాను యింటిదగ్గరగా వచ్చినట్లు స్ఫురించింది. బయట తన మామగారైన ప్రిన్సిపాల్‌గారు నిల్చున్నారు. ఏవో ఆలోచనల్లో మునిగి వుండటంవల్ల రంగారావు తన మామగారిని చిరునవ్వుతోనైనా 'విష్' చేయకుండా సరాసరి లోనికెళ్ళాడు. మందస్మితవదనంతో ఆయనను పలుకరించటానికి లేడీ డాక్టర్ అక్కడే నిలుచొనివుంది.

"హలో ప్రొఫెసర్‌గారూ! ఒక పెద్ద వ్యత్యాసము మినహాయిస్తే మీరు హెన్రీఫోర్డుకు సమానులు: ఫోర్డుమోటారుకార్లు ఉత్పత్తిచేస్తే, మీరు సంతానాన్ని ఉత్పత్తిచేస్తున్నారు" అని ఆమె ప్రొఫెసర్‌గారితో స్నేహపూర్వకంగా అంటూ హాస్యంగా మాట్లాడుతుంటుంది.

"మీరు చెప్పేది నాకేమీ అర్థంకాలేదు...." అని రంగారావు అంటూండగానే 'అర్థంకాలేదూ....? ఇది మీకు చాల ఆనందదాయకమైన విషయం. దేశజనాభాకు మీరు మరొకరిని కలుపటంద్వారా దేశానికి మీ రెంతో సేవ చెయ్యగలిగారు. ఇది కలుపుకొని మీరు మొత్తంమీద అరడజన్ సంతానానికి పితృ



మూర్తి కాగలిగారు. మీరు ఎంత అదృష్టవంతులు. మీరు దేశానికి ఇంకా ఎంతో సేవ చేయాల్సుంటుంది" అని లేడీడాక్టర్ ఇంకా చెప్పుకుపోతుంటే 'అది కాదండీ! నా శ్రీమతి గర్భవతి కానిదే!' అని తన సందేహాన్ని వెలిబుచ్చాడు. లేడీ డాక్టర్ ఫకాలున నవ్వి 'ఆమెకు నవమాసాలు నిండాయి కానీ, గర్భం వచ్చినట్టు అగుపడదు, చాలమంది స్త్రీలకు ఇలాగే....' అని లేడీ డాక్టర్ పలికి తన మెడిసన్‌బ్యాగ్ సర్దుకోటం మొదలెట్టింది.

రంగారావుకి మూర్ఛవచ్చినంత పనైంది. అతనిచూపుల్లో నిరుత్సాహం ప్రతిఫలించింది. [కాపు చెల్లాచెదరైంది. బూడ్సుల్లో దాక్కున్న మేజోళ్ళు వదులైనట్లనిపించింది. నౌకరు

క్లాసుద్వారంవద్ద తాను అడిగినప్రశ్నకు సమాధాన మివ్వటానికి కారణమేమిటో, తాను ఇంట్లో అడుగిడుతున్నపుడు మామగారైన ప్రిన్సిపాల్‌గారు తన్నుచూచి పళ్ళు ఎందుకు బహిర్గతపరిచారో, ఇంట్లో అడుగెట్టగానే లేడీ డాక్టర్ మందస్మితవదనంతో ఎందుకు అగుపడిందో, రంగారావుగారికి ఇప్పుడు బాగా తెలిసివచ్చింది. 'కుటుంబ నియంత్రణ'ను గూర్చి ప్రచారంచేసే తనకు మరో సంతానం కలిగిందంటే 'క్లాసులో చెప్పేవి శ్రీరంగ నీతులు....దూరేవి దొమ్మరగుడిసెలు' అని వ్యాఖ్యానించే విద్యార్థులు. 'చెప్పేది సులభం కానీ ఆచరించటం కష్టం' అని వ్యంగ్యసంభాషణలు వల్లించే విద్యార్థులు, ఎందరో తటస్థిస్తారనీ, వారికి తన ముఖమెల్లా చూపటమా? అని ఆలోచించసాగారు రంగారావు. ప్రతి ఒక్కరూ చెప్పేదానికీ .... చేసేదానికీ ఎంతో వ్యత్యాసముంటుందనే విషయం రంగారావుకి అప్పుడప్పుడే అనుభవంలోనికొచ్చింది. 'దేశ ఆర్థికజీవితప్రమాణాన్ని వృద్ధికి తెచ్చేముందు నీ జీవిత ఆర్థికప్రమాణాన్ని వృద్ధిచేసుకో' అని బయట లేడీడాక్టర్ పలికినపలుకులు కుర్చీలో నిర్జీవిలాగకూర్చున్న రంగారావు కర్ణపుటాలలో గింగురుమన్నాయి. తన ఆశయం నెరవేరలేదని బాధపడుతున్న రంగారావుగారికి, లేడీ డాక్టర్ పలికిన పలుకులు 'గోరుచుట్టుపై రోకటిపోటులాగ పనిచేశాయి.

[ఒక ఆంగ్లకథకు అనుసరణ] *